# తెలుగు పల్లెల్లో గాంధీ సిద్ధాంతాల ప్రభంజనాన్ని అక్షరబద్ధం చేసిన మూడు అపురూప నవలలు

## ('రాజ్యలక్ష్మి', 'మాధవా శ్రమమం', 'కొల్లాయి గట్టితే నేమి')

ఆచార్య మొదలి నాగభూషణ శర్మ

**తె**లుగు నవలా సాహిత్యంలో గాంధీజీ వ్యక్తిత్వాన్ని, ఆనాటి బ్రిటిష్ వ్యతిరేకపోరాటాలని గాంధీజీ ప్రబోధించిన నిర్మాణ కార్యక్రమాలను ప్రతిబింబించిన నవలలు చాలావున్నాయి. ప్రఖ్యాత రచయితలు చాలామంది గాంధీజీ ప్రభావానికిలోనైన వారేనని చెప్పాలి. నేరుగా గాంధీజీ జీవితాశయాలను వ్యక్తీకరించిన నవలల్లో మాలపల్లి, వేయిపడగలు, నారాయణరావు, కోనంగి, చివరకు మిగిలేది, చదువు, కొల్లాయిగట్టితేనేమి, అతడు – ఆమె మొదలైన నవలలను పేర్కొనాలి. ఇవి అన్నీ 1920–40 మధ్య కాలంలో గాంధీ ప్రభావానికి లోనైన వ్యక్తుల జీవితాలను జాతీయోద్యమం ఎలా తీర్చిదిద్దిందో చూపే రచనలు. అలాకాక గాంధీజీ సిద్ధాంతాలు, ప్రణాళికలు పల్లె పల్లెకు, ఎలావిస్తరించాయో చూపే మూడు ప్రాతినిధ్య నవలలను గురించి యిక్కడ చర్చిస్తాను. అవి – కేతవరపు వేంకటశాస్త్రిగారి "రాజ్యలక్ష్మి" (1937), గుంటి సుబ్రహ్మణ్యశర్మగారి "మాధవాశ్రమము" (1938) మహీధర రామమోహనరావుగారి "కొల్లాయి గట్టితేనేమి ?" (1965). చివరి నవల 1920 ప్రాంతాల ముంగండలో గాంధీగారి రాకతో మొత్తం గ్రామమంతా జాతీయోద్యమానికి ఎలా అంకితమైనదో చూపుతుంది. "రాజ్యలక్ష్మి" జాతీయోద్యమ భావాలున్న యువతీ యువకులు – వారి అంతస్థు ఏదైనా – గ్రామసేవ చేస్తూ గాంధీజీ ఆశయాలకు తమ జీవితాలను ఎలా అంకితం చేశారో చూపే నవల. ఇక మూడవది గుంటి సుబ్రహ్మణ్యశర్మగారి "మాధవాశ్రమము" దేశంలో పెల్లుబుకుతున్న గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమాలను ఎలా అమలు చేయవచ్చునో చూపిన నవల.

ఈ మూడు నవలలను "ప్రాతినిధ్య నవలలు" అన్నాను. దానికి కారణం "రాజ్యలక్ష్మి" విశాఖపట్నం జిల్లాకు సంబంధించిన కథ. "మాధవాశ్రమము" రాయలసీమకు చెందిన నవల. ఇక "కొల్లాయిగట్టితేనేమి" తూర్పు గోదావరి జిల్లాలో ముంగండలో జరిగినట్లు చూపబడింది. వెరసి ఆంధ్రదేశం నలుమూలలా ఆనాడు ప్రజ్వలించిన గాంధేయ నిర్మాణ సూత్రాల ప్రభంజనాన్ని వెలువరించినవే !.

అలాగే ముగ్గురు రచయితలు మూడు విభిన్నమైన నేపథ్యాల నుంచి వచ్చినవారు. కేతవరపు వేంకటశాస్త్రిగారు తొలితరం నవలా రచయితలలో వరిష్టుడు. 'రాయచూరు యుద్ధము', 'దిలారామ' 'ఇచ్చినీ కుమారి', 'రాజసుందరీ', 'పూర్ణానందము' వంటి చారిత్రక, సాంఘిక నవలలు రాసిన వ్యక్తి. విశాఖపట్నం ఏ.వి.ఎన్.కళాశాలలో తెలుగు పండితులు. తెలుగులో కాల్పానికాత్మక చారిత్రక నవలలకు(హిస్టారికల్ రొమాన్స్) ఆదిపురుషులలో ఒకరు.

ఇక గుంటివారు అనంతపురం జిల్లాకు చెందిన జాతీయోద్యమ కార్యకర్త. బెస్తవాని పల్లె స్వగ్రామం. కరూరులో నెలకొల్పిన ఆశ్రకు అనుభవాలు ఆధారంగా ఆయన గ్రామోద్ధరణకు ఆనాడు (ఈనాడు కూడా) ఎదురయ్యే పరిస్థితులేమిటి, దానిని సామూహికంగా ఎదుర్కొనడం ఎలా – అనే విషయాలను స్వయంగా అనుభవించి రాసిన నవల. పప్పూరి రామాచార్యులు గారన్నట్లు "గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమములు తలపెట్టుటలో యీ రచయితకు మంచి అనుభవమున్నది."

మూడవ రచయిత మహీధర రామమోహనరావు. వామపక్ష భావజాలంతో తన చిన్ననాటి గ్రామీణ జీవితాన్ని మన ముందు నిజాయితీతో ఆవిష్కరించిన రచయిత. "కొల్లాయి గట్టితేనేమి?" నవలకు కేంద్ర సాహిత్య అకాడమి బహుమతి లభించింది.

వేరు వేరు దృక్పథాలున్న రచయితలు వేరు వేరు ప్రాంతాలకు చెందిన రచయితలు గాంధీజీ జీవితానికి, ఆయన ప్రబోధించిన నిర్మాణ కార్యక్రమాలకు ఒకేవిధంగా స్పందించి తమ స్పందనను ఎంతో వైవిధ్యంతో తరువాతి తరాలకు అందించడంలోనే గాంధీజీ ఆశయాల సార్వకాలికత, సార్వజనీనత వ్యక్తం అవుతున్నాయని చెప్పవచ్చు.

## కేతవరపు వేంకటశాస్త్రిగారి "రాజ్యలక్ష్మి" (1937)

గాంధీజీ జీవితాన్ని ఆశయాన్ని ప్రతిబింబించే తెలుగు నవలల్లో కేతవరపు వేంకటశాస్త్రిగారి "రాజ్యలక్ష్మి" కి పెద్ద పీట వేయకతప్పదు. 1930లలో నెలకొన్న తెలుగు కుటుంబ జీవితాన్ని, సంఘజీవితాన్ని, రాజకీయ జీవితాన్ని యింత నేర్పుగా కలబోసి చూసిన నవలలు బహుతక్కువ. ఇందులో పరమదరిద్రంలో వున్న కుటుంబానికి చెందిన రామారావు, భాగ్యవంతులై సంఘంలో పేరు ప్రతిష్టలున్న రాజ్యలక్ష్మి యిద్దరూ విడివిడిగాను, కలిసి చేసిన నిర్మాణ కార్యక్రమాలు, గాంధీజీ సిద్ధాంతాలను నమ్మి, ఆచారించి, ఆనందంగా జైలు జీవితం అనుభవించిన వారి జీవన ప్రస్థానాన్ని చక్కని నిర్మాణ క్రమంలో అనుసంధానించారు కేతవరపు వేంకటశాస్త్రి.

విశాఖపట్నంలో సబ్‌జడ్జిగా వున్న పేరిశాస్త్రిగారికి ముగ్గురు మగ పిల్లలు, ఒక్క ఆడపిల్ల. మగపిల్లలు గోవిందరావు, వసంతరావు, వాసుదేవరావు. ఆడ పిల్ల పేరు రాజ్యలక్ష్మి. పేరిశాస్త్రిగారి భార్య మంగమ్మ బాగా చదువుకున్నది. స్త్రీ స్వాతంత్ర్యాభిలాషి. మహిళామండలి అధ్యక్షురాలు. గోవిందరావు భార్య కమల. ఆమె కూడా బాగా చదువుకున్నది. మాటకారి. దివ్యజ్ఞాన సమాజంలో సభ్యురాలు. రాజ్యలక్ష్మి ఈ యింట్లో అల్లారుముద్దుగా పెరిగింది. అందకత్తె. బి.ఏ.ఆనర్స్ చదువుతున్నది. స్త్రీల స్వశక్తిమీద నమ్మకం, గాంధీజీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న ఉద్యమాలన్నా, గాంధీజీ ఆశయాలన్నా కాంగ్రెసు ప్రణాళికలన్నా గాఢమైన విశ్వాసం.

అనకాపల్లి దగ్గర తుమపాల అని ఒక గ్రామం వుంది. ఆ వూళ్లో ఉన్న శివావధానులు కడుపేద. పెద్ద సంసారం. వీరికి ముగ్గురాడపిల్లలు, ఒక్కడే మగ పిల్లవాడు రామారావు. ఇద్దరాడపిల్లలకి బాల్య వివాహాలు చేసి, కన్యాశుల్కంతో వచ్చిన డబ్బుతో కొన్నాళ్లు జీవించింది కుటుంబం. రామారావు బి.ఏ.ఆనర్స్ పాసయి, తండ్రి చెప్పినట్లు ఉద్యోగంలో చేరక "గాంధి మహాత్ముని యాదేశమును తలదాల్చి కాంగ్రెస్సులో జేరి పని చేయుచున్నాడు.

విశాఖపట్నంలో జరిగే కాంగ్రెసు మహాసభలకు హాజరుకావడానికి మదరాసు నుంచి విశాఖపట్నం వెడుతున్నాడు రామారావు. ఏలూరులో ఒక పెళ్లికి వెళ్లి తిరిగి విశాఖపట్నం వెడుతున్న పేరి శాస్త్రిగారి కుటుంబం కూలీ దొరక్క బండెడు సామాను రైలు పెట్టెలోకి ఎక్కించడం ఎలా అని మధనపడుతున్న సమయంలో ఆపద్బాంధవుడిలా రామారావు సాయబడి ఆ సామానంతా రైల్లో పెట్టాడు. ఇంత పరోపకారం చేసే వాళ్లున్నారా అని ఆశ్చర్యపడ్డది రాజ్యలక్ష్మి.

సామర్లకోటలో రైలు ఆగినప్పుడు రామారావు ఆడవాళ్ళ పెట్టె దగ్గరకుపోయి, వాళ్లకి మంచినీళ్లు అందించి తిరిగి వెడుతూ వుండగా కమలమ్మ–పేరిశాస్త్రిగారి పెద్దకోడలు–రామారావుతో మాటల్లో పడ్డది. ఆ మాటలన్నీ రాజ్యలక్ష్మి వింటూనే వుంది. కమల ప్రశ్నలకు జవాబు చెబుతూ తన తండ్రి న్యాయవాది వృత్తి చేసి యింటిని నడుపుతున్నాడని చెబుతాడు "మీ జనకులట్లు కష్టపడుచుండగా మీరిట్లు దేశసేవకై ప్రయత్నించుట న్యాయమా?" అని నిలదీస్తుంది. దానికి సమాధానంగా రామారావు "మీరనునది సత్యమే. అదియు నాలోచించితిని. సకల మానవ ధర్మములలోను ముఖ్యమైనది దేశరక్షణము. సకల సౌఖ్యములలోను స్వాతంత్ర్యము గొప్ప సౌఖ్యము. నాకు నామీద నెల్లపుడు వాని యందాసక్తమైయుండును. అందుచే నిట్లు చేయవలసి వచ్చినది" అంటాడు. సరిగ్గా తన అభిప్రాయాలనే ఆయననోటి వెంట వినడంతో అతనంటే యిష్టం ఏర్పడ్డది రాజ్యలక్ష్మికి. ఆ ఇష్టాన్ని గమనించిన కమలమ్మ మరదలిని ఆటపట్టించడం మొదలుపెట్టింది.

విశాఖపట్నంలో దిగాక అతను తమ యింటికి దగ్గరలోనే దిగుతున్నాడని తెలుసుకొని తమ యింటికొకసారి రమ్మని పిలుస్తుంది కమలమ్మ. అలాగేనంటాడు రామారావు. ఆ రోజంతా రాజ్యలక్ష్మి మనసులో ఆరాటం. అతను బి.ఏ.ఆనర్సు. తనలాగే జాతీయభావాలు కలవాడు. తనలాగే దేశస్వాతంత్ర్యాన్ని కాంక్షిస్తున్నాడు. అయితే, తల్లి చెప్పినట్లు అది "ముష్టి సంబంధము". అయినా తన మనసుకు నచ్చినవాడు, ఎన్ని అవాంతరాలు వచ్చినా అతనినే పెళ్లిచేసుకోవడానికి నిశ్చయించుకుంది. తర్క వితర్కాలు చాలా జరిగాక ఈ పెళ్లికి తల్లిదండ్రులు కూడా అంగీకరించారు.

అయితే పిల్లవాడి అభిప్రాయం తెలియదు. అందుకోసం కాచుకుని కూర్చున్నది. కమల. ఒకరోజు పేరిశాస్త్రిగారి మూడవ కుమారుడు వాసుకోసం రామారావు శాస్త్రిగారింటికి వచ్చాడు. ఇదే అదననకున్నది కమల. అతనితో ఏకాంతంగా మాట్లాడింది. పెళ్లిచేసుకోవడానికి తనకున్న అభ్యంతరాలు నిర్మొహమాటంగా చెప్పాడు రామారావు. ఉద్యమంలోకి వచ్చాక తనకు ఉద్యోగం చేయాలన్న అభిలాషలేదు. పైగా అది పేదకుటుంబం. నాలుగు వీధుల్లోను ఉపాదానం తెచ్చుకొని గడిపే సంసారం. ఇటువంటి

సంబంధాన్ని ఏ అమ్మాయి ఒప్పుకోదంటాడు రామారావు. "ఇది ఆర్థికమైన అంతరం. డబ్బు శాశ్వతం కాదు." అంటుంది కమల "ఇంతకూ ఆ అమ్మాయి ఎవరు?" అని అడిగాడు రామారావు. "మా మరదలు రాజ్యలక్ష్మి" ఆశ్చర్యపోయాడు రామారావు. ఇంతటి అదృష్టం తనను వరించడాన్ని జీర్ణించేసుకోలేకపోతాడు అతను. ఇంకా అభ్యంతరాలున్నాయా?" అంటుంది కమల. "ఈ సంబంధానికి మా వాళ్లు ఒప్పుకోరు" అని చాలా కారణాలు చెబుతాడు రామారావు. మొదటిది – పిల్ల ఇరవై యేళ్లది – అదే అభ్యంతరం. కమల శారదా చట్టాన్ని గుర్తుచేసి 14 ఏళ్ళుదాటగానే పెళ్లిచేసుకోవాలని ప్రభుత్వమే చెబుతున్నది– అంటుంది. మూడో అభ్యంతరం తాము ద్రావిడులమని, అమ్మాయి వైదీకి వెలినాటివారి పిల్ల అని. కమల నవ్వి "మతాంతర కులాంతర వివాహాలే జరుగుతూవుంటే శాఖాంతర వివాహాలు కుదరవంటావేం తమ్ముడు!" అని నిలదీస్తుంది. రామారావు–యివన్నీ తన అభిప్రాయాలు కావని, రేపుపొద్దున అమ్మాయి మా యింటికి వస్తే ఎదుర్కోవలసిన సవాళ్లని అంటాడు.

ఈ అభ్యంతరాలను పరిశీలిస్తే ఆనాటి బ్రాహ్మణ వివాహాల్లో సంప్రదాయవాదులకు సంస్కరణవాదులకు మధ్య వివాహ విషయంలో తలయెత్తే ప్రతి సమస్యా చర్చించబడ్డది. ఇది వివాహదశ.

నవలలో రెండవదశ కుటుంబపోషణ. పల్లెటూళ్లో వివాహం చేస్తే ఛాందస బ్రాహ్మలు దుమ్మెత్తి పోస్తారని–పేరిశాస్త్రిగారి స్వగ్రామం అయినవిల్లిని రద్దుచేశారు. విశాఖపట్నంలో చేస్తే యింతకన్నా అవాంతరాలున్నాయి. పేరిశాస్త్రిగారు ప్రభుత్వ ఉద్యోగి. తెచ్చుకుంటున్న అల్లుడు జాతీయవాది. రెంటికీ పొంతన కుదరదు. దీని విషయం పై వర్గాలలో తెలిస్తే పేరిశాస్త్రిగారి జడ్జిపదవికే ఎసరు రావచ్చు. అందువల్ల జాగ్రత్తగా ఆలోచించి పెళ్లి సింహాచలంలో జరపాలని నిశ్చయించారు. పేరిశాస్త్రిగారు పెళ్లికి వెళ్ల లేదు. మంగమ్మగారు, కమల, రాజ్యలక్ష్మి అన్నలు, చాలామంది కాంగ్రెసువారు సంస్కరణవాదులు వచ్చి పెళ్లి బ్రహ్మాండంగా జరిపించారు.

పెళ్లి అయిన తరువాత రామారావు భార్యను తీసుకొని తుమపాల వెళ్లాడు. చిన్న తాటాకుల యిల్లు. ముగ్గురు కూతుళ్లలో పెద్దవాళ్లిద్దరు నడవలో పడుకొని వున్నారు. కాంతమ్మ పెద్దది. ఆమెకు ఆర్గురు పిల్లలు. అందరూ ఒకరినొకరు రక్కుకుంటు ఏడుస్తున్నారు. రెండవ ఆమె గంగమ్మ. ఎవరినైనా ఎంత మాటపడితే అంతమాట అనే మనిషి. మూడవ పిల్లకింకా పెళ్లికాలేదు. ఈ యింట్లోకి తీసుకువచ్చి వాళ్లు నిర్ఘాంతపోగా తండ్రికి తల్లికి తన భార్యను పరిచయంచేశాడు. గంగమ్మ అప్పుడే నోరుచేసుకున్నది రాజ్యలక్ష్మిని సానిలావుందనీ, వాలుజాడవేసుకున్నదనీ, బాహాటంగా మగవాళ్లతో మాట్లాడుతున్నదని. రాజ్యలక్ష్మి అన్నింటికి తాపీగా సమాధానం చెప్పింది. అందర్నీ పేరుపేరునా పరిచయం చేశాడు. ఆమె అరమరికలు లేక అందరినీ దగ్గరకు తీసుకున్నది. ఆ వినయానికి మర్యాదకు శివావధానులు, నరసమ్మగార్లు చాలా సంతోషపడిపోయారు.

తల్లి అనుమానం నిజమైంది. ఊరు– వాళ్లను వెలివెయ్యడానికి ఆలోచిస్తున్నది. రాజ్యలక్ష్మికి విశాఖపట్నంలో తెలిసిన రంగమ్మ ఆ వూళ్లో మహిళామండలి నడుతుపుతున్నది. ఆమె రాజ్యలక్ష్మిని చూడడానికి వచ్చినప్పుడు ఈ వెలి విషయం ప్రస్తావనకు వచ్చింది. రాజ్యలక్ష్మి డబ్బుతో రామారావు తమ యింటి పక్కనే కొన్న యింటి గృహప్రవేశం నెపంతో ఊరివారందరినీ భోజనాలకు పిలవమంది రంగమ్మ. ముందుగానే ఊళ్లోని పెద్దలను పిలిచి భారీగా సంభావనలు ముడతాయన్న సూచన చేసింది. గృహప్రవేశం అట్టహాసంగా జరిగింది. ఊరిల్లపాదీ వచ్చారు. రామారావు రాజ్యలక్ష్మి భారీ సంభావన లిచ్చారు. అంతటితో వెలిసంగతి వెనుకకూ పోయింది. కాంతమ్మ, గంగమ్మ కూడా వదినగారితో సఖ్యంగా ఉండడమే మేలని నిశ్చయించుకున్నారు.

శారదాచట్టం వస్తున్నదని భయపడ్డ సనాతనులు తమ పిల్లలకు వారి యీడుతో సంబంధం లేకుండా–అతి బాల్య వివాహాలు చేశారు. అందులో కాంతమ్మ పిల్లలిద్దరూ ఉన్నారు. కాంతమ్మ భర్త సుబ్బయ్య దేశదిమ్మరి. ఉన్నట్టుండి గృహ ప్రవేశం జరిగిన మన్నాడు వాకిట్లోకి పోలీసులతో సహా సుబ్బయ వచ్చాడు. అందరూ గుమిగూడారు. ఏమిటి సంగతంటే, తాను శారదా బిల్లుకు వ్యతిరేకంగా యిద్దరు పిల్లలకు బాల్యవివాహాలు చేశాడని, ఇది చట్టం ప్రకారం నేరం కనక యాభైరూపాయలు జరిమానా విధించారు. అది కట్టకపోతే కారాగారవాసమే? అందుకోసం పెళ్లాం మెళ్లో వున్న నానుతాడు తాకట్టు పెట్టి పోలీసులకు డబ్బు చెల్లించాలని సుబ్బయ్య ఆలోచన. నేనివ్వనంది కాంతమ్మ. నువ్వు ప్రాణం తీస్తే కదా పిల్లలకి పెళ్లిళ్లుచేశాను. ఇస్తావా చస్తావా అని కూర్చున్నాడు సుబ్బయ్య. భార్య నిరాకరించడంతో సుబ్బయ్య ఆమె కొప్పు పట్టుకొని నానుతాడు కోసం పెనుగులాడాడు. రామారావు అడ్డం వచ్చినా లాభంలేకపోయింది. అప్పుడు రాజ్యలక్ష్మి సుబ్బయ్యను వారించి నిందుచూలాలిమీదనా నీ ప్రతాపం అని కోపించి తన దగ్గర వున్న డబ్బులో నుంచి యాభైరూపాయలిచ్చి పంపింది. నువ్వెందుకిచ్చావని కాంతమ్మ అడిగితే నా భర్తతో తోబుట్టువు

నాకు మాత్రం తోబుట్టువుకాదా? అది నాధర్మం - అన్నది రాజ్యలక్ష్మి.

ఇంట్లో శుభకార్యం పూర్తయిన తరువాత ముందు సంగతేమిటని ఆలోచించారు రామారావు, రాజ్యలక్ష్మి. భార్య పుట్టింటి నుంచి తెచ్చి యీ కుటుంబం మీద ఖర్చుచేయడం రామారావు కిష్టంలేదు. తనకెక్కడన్నా ముప్పై, నలభై రూపాయల ఉద్యోగం దొరుకుతుంది. కాని ఏ ఆశయంకోసం యింత కాలం మధనపడ్డాడో అది నిర్వీర్యమవుతుంది. పైగా ఉద్యోగం కోసం వెడితే వీడు "నాన్ కో ఆపరేటివ్" అని తిరస్కరిస్తున్నారు. ఇద్దరూ ఒక్కటే ఆలోచించారు. తమ ఆశయాలను త్యాగం చేయ్యకుండా బ్రతుకు తెరువును చూసుకోవడం ఎలా అని.

వారిద్దరి ఆలోచనలలో తమ ఆశయాలకు అనువుగా వుండే బ్రతుకు తెరువు మార్గం చూసుకోవాలని. రాజ్యలక్ష్మికి యీ రెంటినీ కలుపుకు పోయేమార్గం ఖద్దరు పరిశ్రమలో కనిపించింది. కాంగ్రెసువారి కార్యక్రమాలలో అది ఒకటి. గాంధీజీ గ్రామ పునర్నిర్మాణ కార్యాక్రమాలలో రాట్నంవడకడం ముఖ్యమైనది. అందులో దేశసేవ ఉంది. ధనాదాయమూ ఉంది. అందువల్ల ఆ వూళ్లో స్వదేశీవస్త్ర నిలయాన్ని నెలకొల్పి పత్తి కొని, ఏకులు చేయించి, యింట్లో వున్న ఏడుగురు పెద్దవారు రాట్నాలుపెట్టి నూలు వడికి బట్టలు నేయిస్తే తమ కుటుంబానికి లాభం, దీనివల్ల పదుగురు బీదలకు పని కల్పించవచ్చు. ఇప్పుడు అందరూ సోమరిపోతులుగా కాలం గడుపుతున్నారు. పనిచేస్తే రోజుకు రెండురూపాయలు (ఆ రోజుల్లో) సంపాదించవచ్చు.

ఇది నవలలో మూడవ దశ - ఉద్యమస్ఫూర్తి దశ.

ఈ ఆలోచన చాలా బావున్నది. కాని ముందు మదుపు ? తన డబ్బు అమ్మదగ్గర వున్నదని అది తెప్పిస్తానన్నది రాజ్యలక్ష్మి. అందరూ కార్యరంగంలోకి ఉరికారు. శివావధాని, నరసమ్మ, ముగ్గురు ఆడ పిల్లలు, రాజ్యలక్ష్మి, రామారావు అందరూ యిప్పుడు నూలువడికే పనిలో పడ్డారు. నెలరోజులు తిరిగే సరికి ఆదాయ వ్యయాలు లెక్కచూచి ఒక్కొక్కరు ఎంత నూలు వడికారో లెక్కలు తేల్చింది రాజ్యలక్ష్మి. మొత్తం రాబడి యాభై ఆరు రూపాయలు. కాంతమ్మ, గంగమ్మల సంతోషానికి మేరలేదు. తాము కూడా డబ్బు సంపాదించిన వాళ్లమయ్యామని మురిసిపోయారు. ప్రతివాళ్లు పోటీపడి నూలు యింకా సన్నగాను, యింకా ఎక్కువగాను వడకడం మొదలుపెట్టారు. ఖర్చులు పోను మిగిలిన సొమ్మును మామగారికిచ్చేది రాజ్యలక్ష్మి -యింటి ఖర్చులకు.

సంవత్సరం తిరిగేసరికి తుమపాలలోని స్వదేశీ వస్త్రనిలయం రాష్ట్రంలోనే పేరుపొందింది. అటువైపు వస్తున్న జాతీయోద్యమ నాయకులు ఆ వూరు వచ్చి ఆ దంపతులు చేస్తున్న స్వరాజ్య నిర్మాణ కార్యక్రమాలను చూసి, ఆనాటినుంచి తమ ప్రాంతంలో కూడా అటువంటి వాటిని ప్రారంభించాలని ఉత్సాహపడ్డారు.

రామారావు, రాజ్యలక్ష్ముల స్వదేశీ వస్త్ర నిలయం ప్రజల సహకారం, నాయకుల ప్రోత్సాహం లభించడంతో వారి దృష్టి యితర నిర్మాణ కార్యక్రమాల వైపుకు మళ్లింది. విదేశీ వస్తు బహిష్కరణ, అస్పృశ్యత నివారణ, మద్యపాన నిషేధం వంటి అనేక కార్యక్రమాలను గాంధీజీ ప్రజల ముందు వుంచి దేశవాసులంతా వాటికి కృషిచేయాలన్న పిలుపు నిచ్చారు. రామారావు యీ విషయాలను గురించి ఒక సభను తుమపాలలో పెట్టాలని ఆలోచన. రామారావుకు దానికి రాష్ట్రం నలుమూలల నుంచి నాయకులు వచ్చారు. ఆ సభకు అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి.

రాజ్యలక్ష్మి తన ప్రసంగంలో రాష్ట్రంలో చేపట్టిన స్వదేశీ కార్యక్రమాలకు బ్రిటీష్ ప్రభుత్వం ఎలా విఘాతం కలిగిస్తున్నదో సోదాహరణంగా వివరించింది. ముందుగా స్వదేశాభిమానము సకల శ్రేయస్సులకు మూలము "అని చెబుతూ స్వదేశాభిమాన మంటే ఏమిటో నిర్వచిస్తుంది.

> "స్వదేశాభివృద్ధిని మదిగోరుచు, స్వదేశమందుత్పన్నములగు వస్తువులనే వాడుకొనుచు,
> స్వదేశము నందు బండిన వస్తువులనే భుజించుచు వర్తించుటయే స్వదేశాభిమానము...
> విదేశ వస్తు బహిష్కారముగావించి స్వదేశి పరిశ్రమ నభివర్ధించుటయు, స్వసంఘమును బాదు
> చేయు దురాచారములను దొలగించు కొనుటయు ఎల్ల దేశముల వారికిని, ఎల్ల సంఘముల
> వారికిని అనుసరణీయములే సర్వదేశ సామాన్యములగును నివి భరతఖండ వాసులకు మహా
> పరాధములుగా నిర్ణయించుట దొరతనము వారి నిరంకుశత్వమును వెల్లడించకమానదు."

ఇలా ప్రారంభించి రాజ్యలక్ష్మి ప్రతి నిర్మాణకార్యక్రమాన్ని గురించి విపులంగా తన అభిప్రాయాలను వెల్లడించింది. అందులో ఆమె ప్రత్యేకంగా పేర్కొన్న విషయం మద్యపాన నిషేధం గురించి. భారత ప్రభుత్వం కూడా మద్యపానం కూడదని,

త్రాగుడు మానుడని పెద్ద పెద్ద అక్షరాలలో బస్సులకంటించి ప్రచారం చేస్తున్నది. అయినా అది మాన్పడానికి కార్యాచరణ ప్రణాళిక యింత వరకు తేలేదు. మన ప్రస్తుత కర్తవ్యం మద్యశాల పికెటంగ్. అది శాంతి యుతంగా జరగాలని ఆమె నిర్దేశిచింది.

ఆమె ఉపన్యాసం సర్వజనామోదం పొందింది. ఆ తరువాత అతిథులుగా విచ్చేసిన నాయకులందరు యీ విషయాలనే రూఢిచేశారు.

చివరగా ఆమె యీ కార్యక్రమాల రూపకర్త గాంధీ గారిని "మహోత్తమ పురుషుడని, అవతార పురుషుడని, ఆధ్యాత్మికతను లౌకిక జీవితానికి అనుసంధానం చేసిన మహాత్ముడ "ని కొనియాడింది.

సభానంతరం ప్రజలు నాయకులు తుమపాల దగ్గరగా వున్న కల్లంగడిని మూయించడానికి బయలుదేరారు. జెండా పట్టుకొని "మహిషాసురమర్దని" వలె జనం ముందు నిలిచింది. ఈ జనమంతా కల్లంగడి చేరుకొనే సరికే రెండు లారీల పోలీసులు అక్కడ మోహరింపబడ్డారు. నాయకులు మద్యంతాగుతున్న వారి దగ్గరకు పోయి "నాయనలారా, త్రాగుడు మానండి అని బ్రతి మాలడం ప్రారంభించారు. రాజ్యలక్ష్మి దుకాణదారులను కూడా వేడుకున్నది. వారు కూడా దుకాణాలు మూయడానికి సిద్ధపడ్డారు.

ఇంతలో పోలీసు అధికారి ఆజ్ఞతో పోలీసులు బ్రతిమాలుతున్న కాంగ్రెసువారిని లాఠీలతో కొట్టడం మొదలుపెట్టారు. రాజ్యలక్ష్మికి నొసటిమీద లాఠీ దెబ్బ తగిలి రక్తం కారుతున్నది. అయినా ఆమె ప్రచారం మానలేదు. "మాకేమయినా ఫరవాలేదు. మనమందరం కలిసి యీ తాగుడు మహమ్మారిని రూపుమాపాలి" అని నినదించింది. "భారత్‌మాతాకీ జై" అనే నినాదాలు మిన్ను ముట్టాయి. పోలీసులు మీరందరూ అపరాధులు అని అక్కడ పికెటింగ్ చేస్తున్న కార్యకర్తలను అరెస్టు చేసి జైలుకు తరలించారు. వారిలో రామారావు రాజ్యలక్ష్మి కూడా వున్నారు. వెడుతూ రామారావు తన తండ్రితో "మాకేమీ భయంలేదు. వచ్చిన అతిధులకు ఏ లోపమూ రాకుండా చూడండి" అంటూ జీపు ఎక్కాడు.

కూతురు అత్తింట కుదురుకున్నదని విన్న మంగమ్మ ఒక్కసారి ఆమెను చూడాలని తహతహలాడసాగింది. భర్తతో చెప్పి అమ్మాయికి యిష్టమైన తినుబండరాలు, యింటిల్లపాదికీ బట్టలు, రెండు బుట్టల నిండా పళ్లు పట్టించుకొని తుమపాల వెళ్లింది. మోటారు వాహనం వచ్చినా ఎవరు వచ్చారని చూచేవారే లేరు. ఆమె లోపలకు వెళ్ళింది. ఆమెను యింట్లో వారు ఎరుగరు. పెళ్లికి వీరు వెళ్లలేదు. గృహ ప్రవేశానికి వారు రాలేదు. డ్రైవరు వచ్చి వీరు మీ వియ్యపురాలుగారని పరిచయం చేశాడు. అప్పుడు నరసమ్మ ఆమెను రాజ్యలక్ష్మి గదికి తీసుకొని పోయి నిన్న కల్లంగడి దగ్గర భార్యా భర్తలిద్దరూ పికెటింగ్ చేయడం, పోలీసులు అరెస్టు చేసి విశాఖపట్నం జైలుకు తరలించడం ఏడుస్తూనే వైనాతివైనంగ చెప్పింది. నిర్ఘాంత పోయింది మంగమ్మ. పిల్లనెప్పుడూ ఏ కష్టము లేకుండా పెంచారు. అటువంటిది తన కూతురు ఆ కటకటాల వెనుక, కటిక నేలమీద పడుకొని... భరించలేకపోయింది. ఆవిడ వెంటనే తిరుగు ప్రయాణం కట్టింది. ఈ పూటకు ఉండి భోజనంచేసి వెళ్లమని బ్రతిమిలాడారు. కాని ససేమిరా అంది ఆమె. తెచ్చిన పళ్లూ బట్టలు అందరికీ యిచ్చి ప్రయాణమైంది. ఇంటికి వచ్చి ఏడుస్తూ యీ విషయాలన్నీ పేరిశాస్త్రికి చెప్పి, ఎలాగైనా అమ్మాయిని చూడడానికి అనుమతి సంపాదించండి. నా మనసు ఉండ బట్టలేకుండా వుంది అని తహతహలాడింది. పేరిశాస్త్రి ప్రయత్నించాడు. కాని రేపు కలెక్టరుగారు దోషులను విచారిస్తారు కనుక యిప్పుడు వీలులేదని చెప్పారు. భార్యా, భర్త లిద్దరూ ఆ రాత్రి అభోజనం ఉన్నారు.

మర్నాడు ఉదయం కలెక్టరుగారు విచారణ మొదలుపెట్టారు. కోర్టులో వేలకు వేల జనం. అందరూ జయజయధ్వానాలు చేసేవారే! ముందు రామారావును విచారించారు. ఏ ప్రశ్నలకూ అతను సమాధానం చెప్పలేదు. కలెక్టరు పోలీసాఫీసరుతో అతనికి యింగ్లీషురాదా – అని అడిగాడు. ఆయన బి.ఏ.ఆనర్స్ అని చెప్పి వారికేదో సమాధానం చెప్పండి – అన్నాడు. కలెక్టరు నీవు సమాధానం చెప్పకపోతే వెంటనే శిక్షిస్తామన్నాడు. రామారావు కలెక్టరుతో వారి విచారణ మీద తమకు నమ్మకం లేదని అందువల్ల సమాధానం యివ్వడం లేదని చెప్పాడు. కలెక్టరు అతడికి ఆరునెలలు 'బి' క్లాసు కారాగార వాస శిక్ష విధించాడు.

తరువాత రాజ్యలక్ష్మి విచారణ. ఆమె కూడా ముందు మాట్లాడలేదు. ఆమె కూడా ఆనర్స్ అని విన్న కలెక్టరు ఆశ్చర్యపోయాడు. ఒకటికి రెండు సార్లు అడిగాక మీకు పరిస్థితులు విశదపరచాలి కనుక మాట్లాడుతున్నానని చెప్పి ఆ రోజు సాయంకాలం జరిగిన విషయాలన్నీ సవిస్తరంగా చెబుతూ మద్యపాన విషేధాన్ని ప్రభుత్వం కూడా సమర్థిస్తోంది. ఆ పని మేం చేస్తే మమ్మల్ని శిక్షిస్తున్నారు. ఇది దారుణం అన్నది. మీరు హింసకు పూనుకున్నారు కనుక మిమ్మల్ని అరెస్టు చేశారన్నాడు కలెక్టరు. "మేము పికెటింగ్ చేశాం. పోలీసులు దౌర్జన్యం చేశారు" అన్నది. పోలీసు దౌర్జన్యం చేయడమేమిటన్నాడు కలెక్టరు. "చూడండి మేము శాంతియుతంగా

పికెటింగ్ చేశాం. మా చేతుల్లో ఏ ఆయుధాలు లేవు. మీ పోలీసులు లాఠీలతో మమ్మల్ని చావమోదారు. ఇంకా కావాలంటే పరీక్ష చేయండి. పోలీసుల కెవ్వరికీ దెబ్బలు తగలలేదు. మా వాలంటీర్లను పరీక్షించండి. చేతులు విరిగినవారు, కాళ్లు విరిగినవారు ఇక్కడ చూడండి. నన్ను కొట్టడం వల్ల యిక్కడ తగిలిన గాయం." అంటూ తన గాయాన్ని చూపింది. కలెక్టరు నాలుగు గంటలైనదని ఆమెకు ఆరు నెలల శిక్ష, కోర్టులో వాదించినందుకు మరో రెండు నెలలు శిక్ష విధించాడు. ఆమెకూ 'బి' క్లాస్ కారాగారమే. జనం చప్పట్లుచరుస్తూ "మహాత్మాగాంధీకి జై" అంటూ నినదించారు. నిన్న అరెస్టు చేసినవారికి కూడా ఆరునెలలు 'సి' క్లాసు శిక్ష విధించాడు కలెక్టరు. వెంటనే రాజ్యలక్ష్మి అభ్యంతరం చెబుతూ అరెస్టు కాబడిన కార్యకర్తలందరూ ఒకే రకమైన అపరాధం చేస్తే కొందరికి 'బి' క్లాస్ మరి కొందరికి 'సి' క్లాస్ యివ్వడం అన్యాయం అన్నది. కలెక్టరు వినిపించుకోలేదు.

రాజ్యలక్ష్మి నిర్భయత్వాన్ని, సంభాషణా చాతుర్యాన్ని మెచ్చుకోని వారు లేరు. మంగమ్మ కూడా కూతురు ఉపన్యాసానికి ఆశ్చర్యపోయింది. ఆమెను నాల్గవనెల. అది విని ఆశ్చర్యం, దు:ఖం రెండూ కలిగాయి. ఆమెకు భర్తతో చెప్పి అమ్మాయిని కలిపి మాట్లాడే అవకాశమివ్వ మని అడిగింది. మర్నాడు కారాగారానికి వస్తే అవకాశం యిప్పిస్తానన్నాడు పోలీసు అధికారి.

మర్నాడు రాజ్యలక్ష్మిని కలిసినప్పుడు మంగమ్మ కన్నీరు మున్నీరుగా ఏడవడం ప్రారంభించింది. రాజ్యలక్ష్మి మాత్రం తన కోసం దు:ఖించ వద్దని కొంచెం గట్టిగానే చెప్పింది. ఇది సంతోషించవలసిన విషయం అన్నది. కడుపుతో ఉన్న పిల్లకు కావలసినవన్నీ చేసిపెట్టే యోగ్యతలేదా – అన్నది మంగమ్మ మళ్లీ తల్లిని కేకలువేసి తల్లికి నయనా భయనా. తాను చేసిన పని నీవు మెచ్చే పని నీ కూతురన్న వ్యామోహంతో మాట్లాడుతున్నావు. దేశసేవ ముఖ్యం. ఆ తరువాతనే వ్యక్తుల సౌఖ్యం. "దేశమునకు స్వాతంత్ర్యము సంపాదింపుడు. పిమ్మట మీరిప్పుడధికముగా గష్టపడి తెచ్చిన సంస్కారములప్పుడు తమంత తామే సులభముగా నెలకొనును." అని హితవు చెప్పింది. చివరకు తనకీ దేశసేవా భాగ్యం దొరికినందుకు సంతోషించవలసిన ఉండగ నువ్వెందుకు దు:ఖిస్తున్నావు. ఇంత చదువుకున్నావు. కొంచెం ఆలోచించమ్మా !"అని బోధించింది.

ఈ మాటలు విని మంగమ్మకు మతిపోయింది. కూతురు బుజం మీద ఉన్న చేయిదానంతట అదే కిందకు జారిపోయింది. ఆమె కన్నుల్లో నీరు యింకిపోయింది. మోటారులో కూర్చున్న తరువాత పేరిశాస్త్రి భార్యను అడిగాడు ఏమయిందని. "అమ్మో ! అది కూతురు కాదండీ బాబు, అది నిజంగా లోకమాత. "నాకెంతయో యుపదేశమ చేసినది. ఇకనొక్క నిమిషమది విన్నచో నాకును దాని వలె కారాగృహాభిలాష కలుగకపోదు. మఱి మాటడక వెడలి వచ్చితిని" అని చెప్పింది. ఇంకా "ఇంతవరకు నేను విద్యావతినని గర్వించేదాన్ని. ఇప్పుడు విజ్ఞానివతినైనాను." అన్నది.

మర్నాడు సాయంకాలం వాలంటీర్ల నందరిని బళ్లారి జైలుకు తరలిస్తున్నారు. జనం దండలువేసి హారతులిచ్చారు. ఐదు నెలల తర్వాత జైలులో రాజ్యలక్ష్మికి మగపిల్లవాడు కలిగాడు. మంగమ్మ కూతురును మనుమడిని చూసి ముద్దులాడింది. వారి కారాగార వాసం ఆరునెలలు పూర్తికాకముందే ప్రభుత్వం వారు చేసేకున్న సంధి వల్ల వదిలిపెట్టారు.

'పోలీసువారెంత చెప్పినా కూతురు అల్లుడు సహాయనిరాకరణోద్యమంలో ఉన్నందు వల్ల పేరిశాస్త్రిగారి ఉద్యోగం పోయింది. తమతో కొన్నాళ్లు ఉండమని కూతురును కోరినా ఆమె తన యింటికి వెళ్లింది. ఆ యింటిల్లపాదీ సంతోషించారు. రాజ్యలక్ష్మి రామారావులు తమ పిల్లవాడికి తాతగారి పేరుతో శివశంకరరావని పిలుచుకుంటున్నారు.

1930 దశకంలో ఆంధ్రదేశం గాంధీజీ నిర్మాణకార్యక్రమాలకోసం ఎంతటి ఉద్యమాలు నడిపిందో కుటుంబాలకు కుటుంబాలు అందులో ఎలా పాల్గొన్నాయో, వాళ్ల కుటుంబజీవితాలు, రాజకీయ జీవితాలు ఎలా పెనవేసుకు పోయాయో యీ నీవల చూపినంత వివరంగా, క్రమబద్ధంగా మరెన్నో నవలలు చూపలేదని నిష్కర్షగా చెప్పవచ్చు.

.....

## గుంటి సుబ్రహ్మణ శర్మగారి "మాధవాశ్రమము" (1938)

గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలు ఏవిధంగా తెలుగు నవలల్లో ప్రతిబింబించాయో తెలుసుకోగల మరో నవల గుంటి సుబ్రహ్మణ్యశర్మగారి 'మాధవాశ్రమము'. "రాజ్యలక్ష్మి"లా కథా నిర్మాణ చాతుర్యంగాని, పాత్రల చిత్రణలో వైవిధ్యం కాని లేకపోయినా "మాధవాశ్రమం" రాయలసీమలో గాంధీజీ అభిమానించే గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమాల్ని చేపట్టడం, మూఢాచారాల నిర్మూలనం, వాటిని రూపుమాపడానికి మాధవశర్మ వంటివారు ప్రయత్నించడం యీ నవలకు ప్రాచుర్యాన్నిచ్చాయి.

అనంతపురం జిల్లా కరూరు గ్రామానికి చెందిన రామశాస్త్రికి ముగ్గురు మగపిల్లలు. పెద్దవాడు నారాయణశాస్త్రి తండ్రిలాగే పురోహిత్యం చేస్తున్నాడు. రెండో వాడే మాధవశర్మ. అతను బి.ఏ.లో ఉత్తీర్ణుడై, తండ్రి చెప్పినట్లు ఉద్యోగంలో చేరాలా, తన మనసు చెప్పినట్లు మహాత్ముడికి అనుయాయిగా జాతీయోద్యమంలోకి దూకాలా అనే మీమాసలో వున్నాడు. మూడోవాడు యింకా చదువుకుంటున్నాడు. అతిపేద సంసారం కనక మాధవశర్మ ఉద్యోగం చేయక తప్పదంటాడు తండ్రి.

తండ్రి బలవంతాన ఉద్యోగం వెతుక్కోక తప్పదన్న నిర్ణయంతో తన వూరు నుంచి కాలినడకన మూడురోజులకు కర్నూలు చేరుకుంటాడు మాధవశర్మ. ఏంచేయాలో అర్థంకాలేదు. ఎక్కడికి వెళ్లాలో తెలియదు. తండ్రిమీద కోపంతో చేతిలో చిల్లి గవ్వలేకుండా బయలుదేరాడు. అలిసిపోయి ఒక అరుగుమీద చతికిలపడ్డాడు. లోపల ఏదో సందడి వినిపిస్తున్నది. అక్కడే నడుం వాల్చాడు. కొంతసేపటికి ఆ యింటి యజమాని కాబోలు బయటకువచ్చి అక్కడ పడుకొన్న ఆంగతకుడిని చూసి ఎవరునువ్వని అడిగాడు. మాధవశర్మ వివరాలు చెప్పుకున్నాడు. ఆ యజమాని – ముసలాయన – ఆయనపేరు శంకర శాస్త్రి– శర్మను సాన్నంచేసి రమ్మని యింట్లో భోజనం పెట్టించాడు. మా పిల్లవాడు కృష్ణమూర్తిరావు ఊళ్లోలేడు, రాగానే నీకో ఉద్యోగం చూస్తాడు. అప్పటిదాకా నువ్వు యిక్కడే వుండ వచ్చునన్నాడు. మాధవ శర్మ తనకొక పెద్ద అండ దొరికినట్లు సంబరపడిపోయాడు.

తరువాతి రోజున శంకరశాస్త్రిగారి యింట్లో జరిగిన దొంగతనం అనుకోకుండా మాధవశర్మకు అంటకట్టడం జరిగింది. ఒక జ్యోతిష్కుడి సహాయంతో నిజం బయటపడి యింట్లో పోయిన నగలను పనిచేసే వాడు దొంగిలించి తనమీదకు నేరం రాకుండా వుండడానికి ఒక నగను మాధవశర్మ కోటుజేబులో పెట్టాడు. నిజం తెలిశాక యింటివారి తరపున శంకరశాస్త్రిగారు క్షమాపణలు అడిగి, వెళ్లిపోవడానికి సిద్ధపడ్డ మాధవ శర్మను ఆపి తమ పిల్లవాడు వచ్చేదాకా ఉండవలసిందిగా కోరాడు.

కృష్ణమూర్తి రావు కలెక్టరుతో మాట్లాడి ఆ ఆఫీసులోనే గుమాస్తాగా ఉద్యోగం యిప్పించాడు. వెళ్లిన రెండు మూడురోజులకే శర్మ ఖద్దరు బట్టలు కట్టుకొని రావడం నచ్చని కలెక్టరుతో నిర్మొహమాటంగా "ఇవి మా దేశీయదుస్తులు. మీరు మీ దుస్తులు ధరించినట్లుగానే మేము మా దుస్తులు ధరించే స్వేచ్ఛ కూడా మాకు లేదా" – అని ప్రశ్నించాడు. ఇతనికి త్వరగా ఉద్వాసన చెప్పాలని ఆనాడే నిశ్చయించుకున్నాడు కలెక్టరు. మాధవ శర్మ నుంచితనం చూసి శంకరశాస్త్రిగారు తమ కూతురు శారదను అతనికిచ్చి పెళ్లిచేయడానికి నిశ్చయించుకున్నారు. రామశాస్త్రిగారు అంగీకరించారు. వివాహం సలక్షణంగా జరిగింది.

వివాహం అయిన తరువాత ఒక పదిరోజులు భార్యా భర్తలు వచ్చి తన దగ్గర వుండలసిందిగా కోరాడు రామశాస్త్రి. శారదా మాధవశర్మ లిద్దరూ కరూరు వెళ్లారు.

మాధవశర్మ కరూరు వెళ్లేసరికి ఊరి పరిస్థితులన్నీ సంక్షోభంలో ఉన్నట్లు అర్థం అయింది అతనికి. దానికి కారణం ఊళ్లో పొడచూపిన కలరా. దానికి మందులేదని, అదిసోకినవాళ్లకు దగ్గరగా వెళ్లినా వారికి కూడా ప్రమాదమేనని తమవారినే ఊరి చివరి ఉంచుతున్నారు జనం. మాధవశర్మ, అతని యిద్దరు స్నేహితులు–శ్రీనివాసమూర్తి, సదానంద రెడ్డి–రంగంలోకి దిగారు. ఇతర సేవా దృష్టి ఉన్నయువకులను కలుపుకున్నారు. పరిసరాలు బావుండక పోవడం కలరావ్యాప్తికి ముఖ్యకారణమని మునిసిపాలిటీ వారితో కలసి ఊరంతా బాగుచేశారు. వ్యాధి సోకినవారికి కట్టు కట్టడర నుంచి వారి అన్న పానాదులు చూడడం కూడా యీ యువబృందం చేపట్టింది. మాధవశర్మ, అతని మిత్రులు చేపట్టిన యీ సేవాకార్యక్రమం ఆబాలగోపాలాన్నీ అలరించింది.

ప్రజలు నిరక్షరాస్యులు కావడంవల్ల కూడా కలరా వంటి అంటువ్యాధులు వచ్చే ప్రమాదం వున్నందున దానికేం చేయాలా ఆలోచనలో పడ్డారు మిత్రులు. ఊరిబయట తాత్కాలికంగా పాకలు వేసుకొని వుంటున్న ఊరు జనాన్ని తమ తమ యిళ్లకు వెళ్లివుండవచ్చునన్నాడు మాధవశర్మ. కాని ప్రతియింటినీ శుభ్రపరచాలన్నాడు. అలాచేశాక ఊరిజనం మళ్లీ గ్రామంలోకి ప్రవేశించి ఊపిరి పీల్చుకున్నారు. మాధవశర్మకు జేజేలు పలికారు పిన్నా, పెద్దా. కలరా తగ్గిందికదా, అమ్మవారికి జాతర చేద్దాం అన్నారు

పెద్దలు. వెనక కర్నూలులో జాతరలో జంతు బలి ఆపబోయి తానుపడ్డ అవమానం సంగతి జ్ఞాపకం వచ్చింది మాధవ శర్మకు. అందువల్ల ముందుగానే జంతుబలి లేని జాతర చేసుకోవచ్చునన్నాడు.

అప్పటికి మాధవశర్మ కుమారుకు వచ్చి మాసం దాటింది. బావమఱిది ఉత్తరాలమీద ఉత్తరాలు రాస్తున్నాడు ఉద్యోగం ఉండేలాలేదని. మూడు ఉత్తరాల తర్వాత మాధవశర్మ కృష్ణమూర్తిరావుకు ఉత్తరం రాస్తూ తాను తన ఊళ్లో చేయవలసిన కార్యక్రమం చాలవుందనీ, అందువల్ల ఉద్యోగం చేయనని. అత్తింటివారు నిరాశపడ్డారు. తండ్రి కూడా కొడుకు ఏదో ఉద్యోగం చేసుకుంటే తన బాధ్యతలు తప్పుతాయనుకున్నాడు. అన్నదమ్ములకు మాధవశర్మ చేస్తున్న ఏ పనులు నచ్చడంలేదు. తాము వేరుగా ఉంటామన్నారు. మీరు ఎందుకు వెళ్లడం? నేను వెడతాను అని మాధవశర్మ బయటకు వచ్చి తానెక్కడ వుండాలా అని ఆలోచించ సాగాడు. మిత్రుడు సదానందరెడ్డికి ఊరివెలుపల తోట ఉంది. అక్కడ మిత్ర బృందం కలిసేది. రోజూ అక్కడే ఒక చిన్నగుడిసెవేసి అది మాధవశర్మ ఉండడానికి లేక మిత్రుల కార్యస్థానంగా కూడా ఉపయోగపడుతుందనుకున్నారు. అదే మాధవాశ్రమం. దాని ధ్యేయం గ్రామ పునర్నిర్మాణము.

వీరికి వచ్చిన తొలి ఆలోచన ఊరిలో వున్న రెండు కక్షల్ని దగ్గరకు చేర్చాలని. ఒక వర్గానికి కరణం మహాదేవయ్యా, రెండో వర్గానికి మునసబు బలరామిరెడ్డి నాయకులు. ఇద్దర్నీ ఒకచోటకు చేర్చి మాట్లాడాలని అనుకున్న రోజునే వీరబొమ్మడు ధాన్యాన్ని తమ యింటికి తోలించుకొని పోవడానికి కరణం మనుష్యుల్ని పంపాడు. కరణం కొడుకు విశ్వనాధరావు ముందు నిలిచి ధాన్యం బస్తాలను మళ్లించే ప్రయత్నం చేస్తున్నాడు. అప్పుడీ మిత్రులక్కడకు వెళ్లారు. వీరబొమ్మడు కరణంగారి దగ్గర అప్పుతీసుకున్నాడు. బాకీ చెల్లించక సరిగా పండలేదని, ఆ ధాన్యం లేకపోతే సంవత్సరం పొడుగునా పస్తులుండాలని, కిత్తాల మీద చెల్లిస్తానని కాళ్ళవేళ్లా పడ్డా కరణం కొడుకు విశ్వనాధరావు వినలేదు. మొదట వీరబొమ్మడు కరణంగారి మనిషి. ఆయన ఒత్తిడి ఎక్కువ కావడం కనిపెట్టి మునసబు వాడిని దువ్వి తనవైపు లాక్కున్నాడు. అందువల్ల యిప్పుడు కరణం మనుషుల్ని పంపాడు. దానికి ప్రతిగా మునసబు తన మనుషులను పంపాడు. ఏక్షణాన్నయినా ఘర్షణ మొదలుకావచ్చు. అప్పుడు వెళ్లారు యీ మిత్రబృందం. విశ్వనాధరావు మాధవశర్మను యిష్టం వచ్చినట్లు మాట్లాడాడు. మాధవశర్మ ఎన్నోరకాలుగా చెప్పిచూశాడు. రావు వినకపోవడంతో తాను ధాన్యాన్ని కాపాడుతూ వుంటానని, బలరామరెడ్డి మనుష్యులను వెళ్లిపొమ్మని చెప్పమని, వీరబొమ్మడిని ఠాణాకు పోయి ఇన్‌స్పెక్టరుగారితో చెప్పి పోలీసుబందోబస్తుతో రమ్మని పంపుతాడు. మునసబు మనుషులను పంపించి వీరబొమ్మడు ఠాణాకు పోవడంతో నీ సంగతి మా నాన్నతో చెప్పి నీ అంతుచూస్తానని విశ్వనాధరావు తన మనుషులతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

ఇది జరిగాక ఊళ్లో కక్షల్ని సమన్వయ పరచవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని గుర్తించారు మిత్రబబృందం. అందుకోసం ఒక సభ ఏర్పాటుచేశారు. పెద్దలందర్నీ కలిశారు. అందరూ వస్తామన్నారు. కరణానికి యిష్టంలేదు. అయినా సభకుపోయి యిది జరిగేపని కాదని తమకు తమకు మధ్య చాలా కాలం నుంచి విభేధాలున్నాయని అవి తీర్చేవికాదని లేచిపోతాడు. ఆనాడు గ్రామ ఐకమత్య ఆవశ్యకతను గురించి మాధవశర్మ చెప్పిన మాటలు అందరినీ ఆలోచింపచేశాయి.

మాధవాశ్రమం గ్రామంలోని సమస్యలను చర్చించే వేదిక అయింది. ఆ తరువాత మిత్ర బృందం వరుసగా ఖద్దరు ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పడం, అస్పృశ్యతకు వ్యతిరేకంగా ప్రచారం చేసి హరిజనుల క్షేమానికి కార్యక్రమాలు చేపట్టడం, మద్యపాన నిషేధ కార్యక్రమాలు పెద్దఎత్తున కరూరులోనే కాక చుట్టు పక్కల గ్రామాలలో చేపట్టడంతో మాధవాశ్రమం గాంధీజీ సమాశ్వాసించిన గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమాలకు రాష్ట్రంలోనే కేంద్ర బిందువయింది.

ఈ నవలకు తొలిపలుకు రాస్తూ స్వాతంత్ర్య సమరయోధులు పప్పూరి రామాచార్యులుగారు "నేడు పండిత పామరుల నోటనున్న సమస్య గ్రామోద్ధరణమే. కాని పని యెట్లు చేయవలెనో, దానికి కలుగు అభ్యంతరము లెట్టివో, అందువలన లాభ నష్టము లేవో చాలమంది తెలుసుకొన ప్రయత్నింపరు. ఏతత్ గ్రంధకర్త చాలాకాలము నుంచి గ్రామ వాసము చేయుచున్నందున గ్రామ జనుల కష్టము లెట్టివో చక్కగా ఎరుగును. కావుననే యీ గ్రంథములో గ్రామజనుల జీవితమును చక్కగా ప్రతి ఫలింపచేసినాడు" అన్నాడు. గ్రామీణ సమస్యల నన్నింటినీ విపులంగా చర్చించి చాలా విషయాల్లో ఏది మంచిదన్ని విషయం కూడా స్పష్టంచేశారు. అయితే దాని కొక బిగువైన కథా నిర్మాణం చేయకపోవడం వల్ల ఎక్కువగా ఆయా విషయాలమీద ఉపన్యాసాలు ఎక్కవగా ఉన్నట్లు అనిపిస్తుంది.

పప్పూరి రామచార్యులుగారు యీ నవలలో చూసిన మరొక అంశం యిందులో నాయికా పాత్ర లేకపోవడం. ప్రేమ కథలు ఎక్కువ అవుతున్న రోజులలో స్త్రీ పాత్రలేకుండా నవల రాయడం అపురూపం అంటారు రామాచార్యులుగారు.

ఈ నవలలో గ్రామీణ కార్యక్రమాల చర్చ ఉంది. యువకులు చేయవలసిందేముంది అన్న వివరణ ఉంది. వాటి సాదక బాధకాలను గురించిన మీమాంస ఉంది. అంతకన్న ఎక్కువగా గ్రామాలలో ఎదురయ్యే అనేక సమస్యలమీద అవగాహనాత్మకమైన వివరణ ఉంది. ఇంత విస్తృతంగా ఆ విషయాలను అవగాహనతో చర్చిండం యీ నవల ప్రత్యేకత.

....

## మహీధర రామమోహనరావు గారి 'కొల్లాయి గట్టితే నేమి ?' (1965)

భారతదేశ చరిత్రలో 1920వ దశకానికి చాలా ప్రాముఖ్యం ఉంది. జాతీయతా భావం గ్రామ గ్రామాన వేళ్లందుకుంటున్న వేళ, రౌలట్ చట్టం, జలియన్‌వాలాబాగ్‌ల ఇటీవలి బ్రిటీష్ దురాగతాల నేపథ్యంలో దేశం ఏకోన్ముఖమవుతున్న వేళ, గాంధీజీ పిలుపుతో సహాయ నిరాకరణ, విదేశీ వస్త్ర బహిష్కరణ జరిగిందప్పుడే. ఆంధ్రదేశంలో ఈ ఉద్యమాల ప్రభావం భూమికగా ఒక పల్లెలో వస్తున్న మార్పులను భౌతికవాద దృక్పథంతో చిత్రించిన నవల "కొల్లాయి గట్టితేనేమి?". ఛాందస గతానికి, అభ్యుదయం కోసం పోరాడే వర్తమానానికి మధ్య జరుగుతున్న అంతర్యుద్ధానికి అక్షరరూపం "కొల్లాయి గట్టితేనేమి?" 1920–22 మధ్యకాలంలో తెలుగు నేలమీద జరిగిన రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక పరిణామాన్ని భౌతికవాద సంస్కరణాత్మక దృష్టితో అక్షరీకరిస్తుంది ఈ నవల. రావుగారు 1935–39, 1939–45ల నాటి తెలుగువారి సామాజిక, రాజకీయ జీవితాన్ని గురించి "దేశం కోసం", "జ్వాలాతోరణం" నవలలు రాశారు. ఆ నవలలకు కూడా ఈ నవలకు నేపథ్యంగా ఉన్న ముంగండే కార్యస్థానం. ముఖ్యమైన పాత్రలు అందులో కూడా కొనసాగుతాయి. ఆ దృష్టితో చూస్తే ఈ మూడు నవలలు 1920–45 మధ్యకాలంలోని ఆంధ్రుల సాంస్కృతిక సామాజిక జీవితానికి అద్దం పట్టే "నవలాత్రయం" (ట్రియాలజీ) అన్నమాట !.

"కొల్లాయి గట్టితేనేమి?" అన్న పేరు గాంధీజీకి, తద్వారా గాంధీజీ ప్రారంభించిన ఉద్యమానికి ప్రతీక. సామాన్యుల చేతనకు ప్రతీక. దేశీయతా భావనకు ప్రతీక. "కొల్లాయిగట్టితేనేమి, మా గాంధీ కోమటైతేనేమి" అన్న ప్రఖ్యాత గీతరచయిత బసవరాజు అప్పారావుగారి ప్రసిద్ధమైన పాటలోని మొదటివాక్యాన్ని శీర్షికగా గ్రహించాడు రచయిత. ఈ నవలలో ప్రధాన పాత్ర రామనాథం, చిన్నప్పుడే తల్లిదండ్రులు పోతే పినతండ్రి శంకరశాస్త్రి పినతల్లి రాజమ్మ అతన్ని పెంచి పెద్దవాడిని చేశారు. ఆస్తిపాస్తుల్ని పెంచారు. రాజమ్మను 'అమ్మా' అనే పిలుస్తాడు రామనాథం. రామనాథానికి సంప్రదాయం ప్రకారం పదిహేనవ ఏటనే పెళ్లిచేశారు. మామగారు నారాయణమూర్తి పోలీసు ఆఫీసరు. మామగారూ, పినతండ్రీ ఇద్దరూ రామనాథం ఇంగ్లాండు వెళ్లి ఐ.సి.యస్. పాసయి కలెక్టరు కావాలని కలల కంటూ ఉంటారు.

రామనాథం రాజమహేంద్రవరం కాలేజీలో బి.ఏ. చదువుతున్నాడు. సహాయ నిరాకరణోద్యమం దేశాన్ని అట్టుడికుస్తున్నది. విద్యార్థులు ఇంగ్లీషు చదువులు మాని ఉద్యమంలో చేరాలని గాంధీజీ పిలుపునందుకుని రాజమండ్రి కాలేజీ పిల్లలు కొంతమంది కాలేజీలను బహిష్కరించారు. అందులో రామనాథం ఒకడు. మిగిలిన వారందరూ ఏదో ఒక రకమైన ఒత్తిడివల్ల ప్రిన్సిపాలుగారికి క్షమాపణ పత్రం ఇచ్చి కాలేజీలో చేరారు. ఒక్క రామనాథం మాత్రం బయటే ఉండిపోయి ఉద్యమలో చేరిపోయాడు. ఆ రోజుల్లో గొప్ప రాజకీయ నాయకురాలిగా సంచలనాలు సృష్టించిన దువ్వూరి సుబ్బమ్మగారి నేతృత్వంలో రామనాథం తన విదేశీ వస్త్రాల నన్నింటినీ అగ్నికి ఆహుతి చేశాడు. ఖద్దరు బట్టలు కొని, కట్టుకుని తన స్వగ్రామం ముంగండ బయలుదేరాడు. పడవలో ఊరికి వెడుతూవుండగా చింతపూడి అబ్బాయి నాయుడుగారి అమ్మాయి స్వరాజ్యం పరిచయమైంది. నాయుడుగారికి మశూచివల్ల రెండు కళ్లూ పోయాయి. ఆయన బ్రహ్మసామాజికుడు. ఆడపిల్లలు చదువుకోవాలని ఆయన ఆకాంక్ష. రామనాథానిది ముంగండ అని తెలియడంతో "ఆ పక్కనే మావూరు కదా ! మా యింటికి రండి" అని స్వరాజ్యం రామనాథాన్ని ఆహ్వానించింది. సరేనన్నాడు రామనాథం.

స్వరాజ్యానికి చిన్నప్పుడే పెళ్లిచేసారు. స్వరాజ్యం చదువుకోవడం అత్తగారింటి వాళ్లకెవరికీ ఇష్టం లేదు – మరి ఆమె భర్త చదువుకోలేదు కనుక. కాని స్వరాజ్యానికి చదువుకోవాలని ఉండడంతో తల్లితండ్రుల ప్రోత్సాహంతో చదువుకొనసాగిస్తోంది.

రామనాథం కూడా ఆమెను చదువు ఆపవద్దని సలహా ఇస్తాడు.

ఇంటికి వచ్చేసరికి శంకరశాస్త్రిగారు, రాజమ్మ అతన్ని మామూలుగానే పలకరించారు కాని సంగతులు విని నిరుత్సాహ పడ్డారు. పొద్దున్నే పెత్తండ్రిగారి కూతురు విశాలాక్షమ్మ అలాగే పెదవి వివరించింది. సుబ్బమ్మగారికి పంపించడానికి యాభై రూపాయలు కావాలన్నాడు. అన్నీ చిన్న సంసారాలు. “ఎట్లారా?” అని మధనపడ్డది విశాలక్షి. రామనాథం పెద్ద మేనత్తగారి కూతురు మంగమ్మ. మంగమ్మ చిన్నప్పుడే విధవరాలై పుట్టింట్లో ఉంటోంది. ఆమెకు ఎలాగైనా వీరేశలింగంగారు ప్రారంభించిన అనాధ శరణాలయంలో చేరి చదువుకోవాలని. ఆ మాటే చాటుగా రామనాథం చెవిన వేసి ఎలాగైనా తన తండ్రిని ఒప్పించమంటుంది.

లచ్చమ్మ అనే కాపు పినతండ్రి విశ్వనాథం గారిని పలకరిద్దామని వారి ఇంటికి వెళ్లాడు రామనాథం. విశ్వనాథం గారు మరో ఆడమనిషిని చేరదీసి తోటలో ఇల్లు కట్టి అక్కడ ఉంచారు. వారికో కొడుకు – వెంకటరమణ. అతనూ రాజమండ్రిలోనే చదువుతున్నాడు. ఊళ్లో ఎవరూ తన తల్లితండ్రులను భార్యా భర్తలుగా అంగీకరించరని వెంకటరమణకు కోపం. ఇంతలో వెంకటరమణకు ఉన్నింటి వాళ్ల సంబంధం వస్తేచేశారు. వాళ్లూ రమణ తల్లీవాళ్ల కులమే. ఊళ్లో తనను విడేసి చూస్తున్నారని వెంకటరమణకు కోపం. ఇంటికి రాడు. ఉత్తరం రాయడు. రాసినా తల్లి సంగతి అడగడు.

స్వరాజ్యం వాళ్ల పనివాడు సూరాయి కబురుతెస్తే రామనాథం నాయుడుగారిని చూడడానికి వెళ్లాడు. అబ్బాయి నాయుడు అవధాన్లగారి అప్పును తీరుస్తూ ఆ పత్రాల చెల్లుబాటు చేయించమని రామనాథాన్ని అడుగుతాడు. విధిలేక రామనాథం ఒప్పుకున్నాడు.

ఇక తన ఊళ్లో జాతీయోద్యమంలో ముఖ్యమైన పనులను ప్రారంభించాలనుకున్నాడు రామనాథం. ఖద్దరు ఉత్పత్తి, జాతీయ పాఠశాల నడపడం, గ్రంథాలయం స్థాపించడం, అంటరానితనం మాపడానికి, మద్యనిషేధ ప్రచారం చేయాలని సంకల్పించాడు. ఈ పనులన్నిటి నుంచీ రామనాథాన్ని మరల్చడానికి కోడల్ని కాపురానికి తీసుకురావడమే మార్గమని తలిచిన శంకరశాస్త్రి అమలాపురం వెళ్లి రామనాథం మామగారితో మాట్లాడి ఖాయపరుచుకుని వచ్చాడు. నారాయణమూర్తి మాత్రం ‘ అల్లుడైనా కూతురైనా నా ఉద్యోగానికి సంబంధించినంత వరకు ఈ చుట్టరికాలు పనికి రావంటాడు. భార్యను కాపురానికి తెచ్చుకోవడానికి కాలసిన తతంగం అంతా ఇంట్లో వాళ్లు చేస్తుంటే శోభనం చేసుకుని కాపురానికి తెచ్చుకొనే వయసింకా తన భార్య సుందరికి రాలేదని, అప్పుడే శోభనం వద్దన్నాడు రామనాథం.

నారాయణమూర్తిగారి కొడుకు చంద్రశేఖరం కులాంతర వివాహం చేసుకున్నాడు. తండ్రి ఇంట్లోకి రానివ్వలేదు. అతడు వేరుగా ఉండి కాకినాడలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. అతన్ని సంప్రదించాడు. రామనాథం. భార్యని నేరుగా తనతోనే మాట్లాడమని సలహా ఇస్తాడు చంద్రశేఖరం. అమలాపురంలో తన భార్య సుందరిని కలవడానికి వెళ్లాడు రమనాథం ఆమె ఒక్కతే ఉన్నదింట్లో. తన మనోభావాలనన్నింటిని ఒక ఉత్తరంలో రాసి ఆమెకు అందచేసాడు. ఆమె ఉత్తరం తీసుకోవడానికి ఇష్టపడేదు. తనకు చదవడం రాదన్నది. రామనాథం ఆమెతో మట్లాడుతూ ఉండగా నారాయణమూర్తి వచ్చాడు. తన కూతురెవరో పరాయి మగాడితో ఉన్నదని భావించిన మూర్తి పోలీసు కొరడాతో అల్లుణ్ణి కొడతాడు. నిజం తెలిసిన తరువాత కూడా అతను విచారపడలేదు సరికదా, రామనాథం మీద రాజద్రోహ నేరం మోపి అరెస్టు చేసి జైల్లో పెట్లాడు.

శంకరశాస్త్రి రామనాథాన్ని బెయిల్‌తో బయటకు తీసుకొని రావాలని ప్రయత్నించాడు. కాని రామనాథం ఒప్పుకోలేదు. సత్యాగ్రహులెవ్వరూ ప్రభుత్వం అన్యాయంగా కేసులు పెడితే వాదించరన్నాడు. పోలీసు డిపార్ట్‌మెంటు మాత్రం స్వయంగా అల్లుడినే అరెస్టు చేసినందకు అభినందించింది.

రామనాథం ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న పనులను జీర్ణించుకోలేని నారాయణమూర్తి రామనాథం చేస్తున్న కార్యక్రమాలను చిలవలుపలవలు చేసి భార్యకు, కూతురికి నూరిపోశాడు. అప్పటి నుంచీ సుందరి భర్తను విరోధి కిందే చూసేది.

రామనాథానికి ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. జైలు జీవితం, పోలీసుల ప్రవర్తనల మీద అతనికి ఇప్పుడు అవగాహన కలిగింది.

జైలు నుంచి విడుదల అయ్యాక రామనాథం ప్రాయశ్చిత్తతతంగం చేసుకుంటే ఊళ్లో బ్రాహ్మణ్యం తమను వెలివెయ్యరని అందుకు సిద్ధపడ్డాడు శంకరశాస్త్రి, రామనాథం ససేమిరా ఒప్పుకోలేదు. నేనేమీ తప్పు చెయ్యనిదే ప్రాయశ్చిత్తమేమిటన్నాడు.

కొడుకు ప్రవర్తనతో విసుగు చెందిన శంకరశాస్త్రి అతని ఆస్తిని అతనికి ఇచ్చేశాడు.

తన తండ్రికి వైద్యం చేయించడానికి స్వరాజ్యం అమలాపురంలో ఉన్నప్పుడు సుందరి ఆమెకు పరిచయం అయింది. ఇద్దరూ సన్నిహితులైనారు. సుందరి రామనాథంతో తన కతనితో కాపురం చెయ్యడం ఇష్టంలేదని చెప్పింది. రామనాథం తన ఆస్తిలో రెండెకరాలు ఆమె పేర రాసి రిజిష్టరు చేసి ఆమెకు నేరుగా ఇవ్వడం కుదరకపోవడంతో స్వరాజ్యం చేతికిచ్చి సుందరికి అందచేయుమన్నాడు. సుందరి ఆ కాగితాలు స్వరాజ్యం మీద పారేసి, స్వరాజ్యాన్ని తిడుతుంది.

ఊళ్లో హరిజనులు నీళ్ల తెచ్చుకొనే వీలులేక కష్టాలు పడుతున్నారు. వీలు చూసుకొని రామనాథం అతని స్నేహితులు నీళ్లతోడి వాళ్ల కడవల్లో పోస్తున్నారు. హరిజనులు నేరుగా ఊరుబావి నీళ్ల చేదుకోవడానికి ఊరిజనం ఒప్పుకోరు. తరువాత స్నేహితుల సలహాతో తన బావిలో నీళ్ల తోడుకోమన్నాడు హరిజనుల్ని. హరిజనులు నీళ్ల తోడుకొనే కార్యక్రమానికి ప్రారంభించ వలసినదిగా కాశీనాథుని నాగేశ్వరరావుగారిని కోరాడు రామనాథం. ఆయన రాగానే ఊళ్లో ఆచారపరులు ఆచారాలన్నీ పక్కన పెట్టి సహపంక్తి భోజనానికి తయారయ్యారు. ఊళ్లో ఆచారాలు కాపాడాలనే సుబ్బన్నశాస్త్రి అందరికీ వడ్డించడానికి తయారయ్యాడు.

రామనాథం, స్వరాజ్యం ఒకరినొకరు ఇష్టపడుతున్నారు. స్వరాజ్యం భర్త మరెవరినో పెళ్లిచేసుకున్నాడని తెలిసిన దగ్గర నుంచీ స్వరాజ్యానికి మళ్లీ పెళ్లి చేయాలనుకుంటున్నాడు అబ్బాయి నాయుడు. కాని రామనాథం స్వరాజ్యాల పెళ్లి తన ఊళ్లో వాళ్లకెవరికీ ఇష్టం ఉండదని స్వరాజ్యాన్ని రామనాథం భార్యగా కాక, ఉంపుడుకత్తెగా చూస్తారని భయపడ్డాడు అబ్బాయి నాయుడు. అయినా వాళ్లిద్దరూ కలిసి బతకడానికే నిశ్చయించుకున్నారు.

1921వ సంవత్సరం మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీలలో బెజవాడలో భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలు జరిగాయి. ఆ సభలకు రామనాథం, స్వరాజ్యం వాలంటీర్లుగా వెళ్లారు. నారాయణమూర్తి అక్కడ స్వరాజ్యాన్ని చూడగానే కోపం పట్టలేక ఆమెను దండించబోయాడు. రామనాథం అడ్డం వెళ్లాడు. ఇద్దర్నీ కాలుస్తానని నారాయణమూర్తి బెదిరించాడు. రామనాథం చలించలేదు. కాల్చే ధైర్యం లేక నారాయణమూర్తి రుసరుసలాడుతూ వెళ్లిపోయాడు. ప్రజలు మాత్రం రామనాథాన్ని అభినందించారు.

గాంధీజీ బెజవాడ సభలకు వచ్చాడు. ఆయనను ముంగండ రావలసిందిగా రామనాథం ప్రార్థించాడు. గాంధీజీ ముంగండ రావడం ఊరంతటికీ ఒక పండగ. శంకరశాస్త్రి వంటి సనాతనరపరుడు కూడా ఒక భగవద్గీత శ్లోకాన్ని తాళపత్రం మీద రాసి, స్ఫుటంటా కనిపించడానికి దానిమీద పసరుపూసి ఆ పత్రాన్ని గాంధీజీకి కానుకగా సమర్పించాడు. సుబ్బన్నశాస్త్రి గాంధీజీని విష్ణుమూర్తి అవతారంగా కీర్తించాడు. ఆంధ్రదేశంలోని ప్రతి పల్లె ఇలాగే కొత్త భావాలకు, స్వాతంత్ర్యా పేక్షకు స్వాగతం పలికాయి.

ఈ నవలకు తన స్వగ్రామాన్ని కార్యస్థానంగా ఎన్నుకున్నాడు రామమోహనరావుగారు. నవల ప్రథమ ప్రచురణకు 'ఒకమాట' అంటూ రావుగారు రాసిన ఉపోద్ఘాతంలో "ఈ నవలకు కేంద్రంగా ముంగండనూ, పరిసరాలను తీసుకోవడం కల్పనలో కొంత భారం తప్పించుకునేందుకు తప్ప దీనిలో పాత్రలేవీ యథార్థాలు కావు. కథ జరిగి ఉండనూ లేదు" అని చెప్పారు. కానీ ముంగడం సనాతన శాస్త్ర విద్యకు, వేదవేదాంగాల అధ్యయానికి ఆ రోజుల్లో కేంద్రంగా ఉండేది. హరిజనులు ఊరి వీధుల్లో స్వేచ్ఛగా తిరగడానికి వీలులేదు. వారు ఊరిబావిలో నీళ్ల తోడుకోవడానికి వీలు లేదు. అటువంటి ఊరే ఇంత మారితే ఆంధ్రదేశంలో కొంతవరకైనా సరికొత్త జాతీయభావాలను ఆహ్వానించే వందలాది గ్రామాలు జాతీయోద్యమాన్ని, సంస్కరణ వాదాన్ని ఎంత స్వాగతించాయో తులనాత్మకంగా తెలుసుకోవడానికి ముంగండ గ్రామం ఎన్నిక అవకాశం ఇచ్చింది.

ఆంధ్రదేశ సామాజిక రాజకీయ చరిత్రను కూలంకషంగా అధ్యయనం చేసి అవగాహన చేసుకున్న ఒక సామ్యవాద రచయిత ఆనాటి జాతీయోద్యమ స్ఫూర్తిని వాస్తవిక దృక్పథంతో తరువాతి తరాల వారికి అందించడంలో కృతకృత్యులనారనడంలో సందేహం లేదు.

. . . .